సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

-10లో ▸



జూరాలకు భారీగా వరద

ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఆదివారం ఎగువ నుంచి భారీగా వరద రావడంతో 29 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

-10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /21.8

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

అక్రమాలకు అడ్డేది..?

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఉపాధి హామీ పనులు



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- గతేడాది రూ.14 లక్షలు దుర్వినియోగం.. రూ.8.02 లక్షలు మాత్రమే రికవరీ
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన సామాజిక తనిఖీలు
- తూతూమంత్రంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణల వెల్లువ
- జిల్లాలో ఇప్పటికే నాలుగు మండలాల్లో పూర్తి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగే అక్రమాలను నిగ్గుతేల్చి అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు సామాజిక తనిఖీలు ఆయుధంగా ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనుల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేసే తనిఖీలు చేపట్టకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన సామాజిక తనఖీలు తూతూమంత్రంగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలకు విలువ లేకుండా పోతుందనే వాదనలు లేకపోలేదు.

గత ఆర్థిక సంవత్సరంలో..

జిల్లాలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో రూ.14,00,699 అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.8,02,844 రికవరీ చేయగా.. ఇంకా రూ.5,97,855 పెండింగ్‌లో ఉన్నాయి. కాగా.. చిన్నచింతకుంట మండలంలో రూ.16,670, గండేడ్‌లో రూ.31,723, హన్వాడలో రూ.3,65,629, మహబూబ్‌నగర్ పరిధిలో రూ.12,948 పూర్తిస్థాయిలో రికవరీ చేశారు. అయితే అవినీతికి పాల్పడిన వారిపై రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్‌ఆర్ యాక్ట్) ద్వారా నిధులు తిరిగి వసూలు చేయలి. అయితే జిల్లాలో ఈ ఉత్తర్వులు వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు. అలాగే అవినీతికి పాల్పడిన సిబ్బందిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినా తిరిగి విధుల్లోకి తీసుకునేలా కొంతమంది సిబ్బంది ఫీల్డ్ లెవల్‌లో చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

❐ ప్రభుత్వం ప్రతి సంవత్సరం గ్రామాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ఉపాధి తనిఖీలు చేయిస్తున్నారు. అక్రమాలను వెలికి తీయడానికి చేసే ఖర్చు కన్నా అక్రమాల విలువ తక్కువగా చూపించడంతో ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించినా వారి నుంచి సొమ్ము రికవరీ చేసే వారు కరువయ్యారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించేందుకు అధికారులుకు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

అన్ని స్థాయిల్లోని వ్యక్తులు..

ఉపాధి హామీ పనుల్లో ఎంపీడీఓ, ఏపీఓలు, ఏఈఈ, టీఏ, సీఓ, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వీఓలు ఇలా అన్ని స్థాయిలోని వ్యక్తులు అవినీతికి పాల్పడుతున్నట్లు సామాజిక తనిఖీల్లో తేటతెల్లమవుతోంది. ఈ పథకం కింద గ్రామాల్లో చెరువులు, పాటు కాల్వల పూడికతీత, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు, వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు కంచెల ఏర్పాటు, మొక్కల సంరక్షణకు నీళ్ల పోయడం వంటి పనులతోపాటు మురుగు కాల్వల పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు వంటి పనులు చేస్తున్నారు. వీటిలోనే ఎక్కువగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయింది. కూలీల సంఖ్య ఎక్కువగా వేయడం, కొందరు పనులకు హాజరు కాకున్నా వచ్చినట్లుగా వారి పేరు మీద వేతనాలు కాజేడం వంటి సంఘటలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనైతే పనులు చేపట్టకుండానే పూర్తి చేసినట్లు నిధులు కాజేసిన ఉదంతాలు సైతం ఉన్నాయి.

చర్యలు తప్పవు..

ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై ప్రజల సమక్షంలో సామాజిక తనిఖీ చేపట్టి నిగ్గు తేలుస్తున్నాం. ఎవరైతే అవినీతికి పాల్పడుతారో వారి నుంచి నిధులు రికవరీ చేస్తాం. ఇందులో ఎంతటి వారు ఉన్నా చర్యలు తప్పవు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 4 మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాం. – నర్సింహులు, డీఆర్‌డీఓ

మండలాల వారీగా ఇలా..

మండలం	అవినీతి జరిగింది	రికవరీ చేసింది
	(రూ.లలో..)	
అడ్డాకుల	1,34,680	19,182
బాలానగర్	55,866	35,686
భూత్పూర్	54,036	34,500
చిన్నచింతకుంట	16,670	16,670
దేవరకద్ర	1,16,000	22,172
గండేడ్	31,723	31,723
హన్వాడ	3,65,629	3,65,629
జడ్చర్ల	46,162	35,500
కోయిల్‌కొండ	1,24,987	48,986
మహబూబ్‌నగర్	12,948	12,948
మిడ్జిల్	1,91,521	53,022
మూసాపేట్	6,018	1,029
నవాబ్‌పేట	47,066	2,260
రాజాపూర్	1,97,393	1,23,537



కోయిల్‌కొండలో ఉపాధి పనుల వివరాలు తెలుపుతున్న సోషల్ ఆడిట్ సిబ్బంది, డీఆర్‌డీఓ నర్సింహులు (ఫైల్)

178 గ్రామాల్లో పూర్తి

జిల్లాలో మొత్తం 16 మండలాలు ఉండగా.. ఇందులో ప్రతి మండలానికి 10 నుంచి 15 గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఇందులోనూ జిల్లావ్యాప్తంగా నాలుగు మండలాల్లో మిడ్జిల్, మూసాపేట్, కోయిల్‌కొండ, రాజాపూర్ మండలాల్లో తనిఖీలు పూర్తి చేశారు. మిగిలిన మండలాల్లో క్రమంగా చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

న్యూస్‌రీల్

24న ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో బుధవారం ఉదయం 9 గంటలకు అండర్–14, 17, 19 విభాగాల బాల, బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ బోనోఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, అండర్–19 విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, బోనోఫైడ్, మూడు ఎలిజిబిలిటీ ఫారాలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగం బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనగాంలో ఈ నెల 25 నుంచి 27 వరకు రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు 18 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, రమేష్‌బాబు, వడెన్న, భాను కిరణ్, మోయిన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్–19 బాలుర జట్టు..

వంశీ, రిషి, మంజునాథ్, చంద్ర సిద్ధార్థ్, హర్షిత్, ఎండీ ముస్తఫా, ఖాజా మోయినుద్దీన్, ఎం.చరణ్, సిద్ధప్ప, హర్షవర్ధన్, భాను, అర్జున్, మోక్షిత్, కె.మహేష్, ఎండీ అఖిఫ్, ధనుష్, రాహుల్, ఎస్.భాను ఉన్నారు.

కోయిల్‌సాగర్‌లో మూడు గేట్ల ఎత్తివేత




దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో మూడు గేట్లు ఎత్తి 2,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు గేట్లను ఎత్తిన అధికారులు సాయంత్రం రెండు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32.5 అడుగులుగా ఉంది. ఇదిలా ఉండగా.. ప్రాజెక్టు గేట్లను తెరవడంతో చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాకేంద్రం నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.

2026లో 'ఎల్లమ్మ' సినిమా



జడ్చర్ల టౌన్: అభిమానుల ఆశీస్సులు, అమ్మవారి కృపతో 2026లో తన తదుపరి చిత్రం ఎల్లమ్మ వస్తుందని బలగం దర్శకుడు వేణు వెల్లడించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో ఆయన సతీమణి శ్రీలత, కుమారుడు రేవంత్, కూతురుతో కలిసి చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులతో ఆయన మాట్లాడారు. బలగం సినిమా లాగే సంస్కృతి, సంప్రదాయాలతోపాటు మంచి విలువలతో కూడిన సినిమా అందిస్తానని పేర్కొన్నారు. బలగం సినిమా మాదిరిగా గ్రామాల్లో ప్రొజెక్టర్లతో ప్రదర్శించేలా సినిమా ఉంటుందా అని భక్తులు అడగగా బలగం సినిమా అద్భుతమని, అలాంటి సినిమాలు మళ్లీ మళ్లీ ఆశించలేమని చెప్పారు.



శ్రీరామ పాదాల దర్శనానికి కొండపై బారులుదీరిన భక్తులు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

శ్రీరామకొండ.. కిటకిట

కోయిలకొండ సమీపంలోని శ్రీరామకొండ భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు శ్రీరామపాదాన్ని దర్శించుకొని రామనామ తారకమంత్రాన్ని పఠించి తరించారు. – నారాయణపేట

- వివరాలు 10లో ▸

ఓపీఎస్ సాధించే దాకా పోరుబాట



మాట్లాడుతున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాత పెన్షన్ విధానం సాధించే దాకా పోరు ఆపమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరుబాట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ కోసం మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో పెట్టిందని దానికి అనుగుణంగా వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులను గత ప్రభుత్వం మోసం చేసిందని ఈ ప్రభుత్వం కూడా అలాగే చేయాలని చూస్తే తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. పోరాటాలతోనే సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని, ఇక మిగిలింది సర్వీస్ పెన్షన్ అన్నారు. సీపీఎస్ ఉద్యోగులు ఏకమై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. జిల్లాలో సీపీఎస్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ సూచించారు. జిల్లాలో సీపీఎస్ ఉద్యోగ సంఘానికి బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కృష్ణమోహన్, డీటీ దేవేందర్, ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేశ్, విజయ్, శ్రవణ్, మల్లేష్, ఖాదర్, లక్ష్మయ్య, మురళి, ఆంజనేయులు, గోపాల్, నరహరి, మద్దిలేటి, నాగరాజు, భాస్కర్‌రెడ్డి, సాయి, చందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన, జిల్లా ఇన్ఫర్‌మేటిక్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు హాజరై బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. సోమవారం పిల్లలమర్రిలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రదేశాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం పిల్లలమర్రి పర్యాటక కేంద్రంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు.

చిక్కింది చిన్న చిరుతే..

- తాజాగా టీడీగుట్టపై కనిపించిన మరో చిరుత

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిక్కిన చిరుతతో పాటు మరిన్ని చిరుతలు ఉన్నాయనే అనుమానాలే నిజమయ్యాయి. ప్రజల అనుమానాలు, భయాందోళనలను అంచనా వేస్తూ మరిన్ని చిరుతలు ఉండొచ్చనే సాక్షి వాదనకు బలం చేకూరింది. దొరికిన చిరుతకు, ట్రాప్ కెమెరాల ఆధారంగా గుర్తించిన చిరుతకు తేడాలను విశ్లేషించి స్పష్టంగా ఈ నెల 16, 18 తేదీల్లో 'సాక్షి' బహిర్గతం చేసింది. ప్రజలు భయాందోళన చెందుతున్నారని రాసిన కథనంతో జిల్లా అటవీశాఖ అధికారులు తిరుమల దేవుని గుట్ట, డంపింగ్ యార్డు ఏరియాలలో మూడు బోన్లు ఏర్పాటు చేసి 16 ట్రాప్, నాలుగు లైవ్ కెమెరాలను అమర్చారు. యథావిధిగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తూ మూడు బృందాలను షిఫ్టుల వారిగా విధులు కేటాయించారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో కోస్గి రోడ్డు ఏరియాలో హైస్కూల్ ఎదురుగా తిరుమల దేవుని గుట్టపై గుండు మీద చిరుత సంచరిస్తూ కనిపించింది. స్థానికులు గుండుపై తిరగాడుతున్న చిరుత వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. చిరుత సంచరిస్తున్న ప్రదేశానికి అటవీశాఖ అధికారులు, పోలీసులు చేరుకొని జనాన్ని పంపించేశారు. ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు చిరుత కనిపించిన ప్రదేశంలో బోన్లు ఏర్పాటు చేశారు. మరింత అప్రమత్తమైన అటవీశాఖ ట్రాప్, లైవ్ కెమెరాల నిఘా పటిష్టం చేశారు. కాగా.. మూడు నెలలుగా వీరన్నపేట, తిరుమల దేవునిగుట్ట, కోయిలకొండ క్రాస్ రోడ్డు ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుతలు మరిన్ని ఉండొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మగ చిరుతగా నిర్ధారణ

తిరుమల దేవునిగుట్ట, వీరన్నగట్టు, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో తిరుగుతున్న చిరుత గుట్టపై ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలో ఫొటోలు రికార్డయ్యాయి. ఈ ఫొటోల ఆధారంగా చిరుత సంచరించిన ప్రదేశాన్ని సందర్శించిన అధికారులు ఫుట్ మార్కులు, ఫొటోలు పరిశీలించి చిరుత మూడు నుంచి నాలుగు సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, మగ చిరుతగా పేర్కొన్నారు. ఈ నెల 15న వీరన్నపేట సమీపంలో టీడీగుట్ట వద్ద బోనుకు చిక్కిన చిరుత వయసు రెండేళ్లలోపేనని, అది కూడా ఆడ చిరుత అని హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ వెటర్నరీ నిపుణులు గుర్తించిన విషయం తెలిసిందే.



టీడీగుట్ట హైస్కూల్ ఎదురుగా గుట్టపై సంచరిస్తున్న చిరుత

రైతుల గోస పట్టని ప్రభుత్వం



నారాయణగౌడ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల, అంజయ్యయాదవ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, రైతులకు కావాల్సిన యూరియా కూడా సరఫరా చేయని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీఆర్‌ఎస్ మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌తో కలిసి వారు మాట్లాడారు. రైతులకు యూరియా ఇవ్వని ఈ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని మండిపడ్డారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే మిషన్ భగీరథను సరిగా మెయింటెనెన్స్ కూడా చేయడం లేదని, నాలుగైదు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు అవుతుందని ఆరోపించారు. పేదలకు వైద్యం అందించాలన్న ఉద్దేశంతో జిల్లాకేంద్రానికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తెస్తే దానిని పూర్తిచేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. జిల్లాలో తమ హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను కొనసాగించాలని, నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వని కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లా ప్రాజెక్టులు ముందుకు తీసుకుపోయేందుకు త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తల్లిదండ్రుల విగ్రహాలను ఆవిష్కరించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు నడుచుకోవాలని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్‌గౌడ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెపక్‌తక్రా పోటీలు

- రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా పాల్గొన్న 20 జట్లు

వనపర్తి: వనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నీలో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల వారీగా ఒక్కో జిల్లా నుంచి మెన్స్, ఉమెన్స్ రెండు జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతిభకనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రూ.800 కోట్లు క్రీడలకు కేటాయించిందన్నారు. క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేందుకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. సెపక్‌తక్రా క్రీడలకు సంబంధించి బాల్స్ కొనుగోలు చేసేందుకు కొంత ఇబ్బందులు ఉన్నట్లు తెలిసిందని ఇందుకు సంబంధించి అట్టి క్రీడకు సంబంధించిన అసోసియేషన్ వారు తమకు నివేదిక ఇస్తే మలేషియా నుంచి బంతుల్ని తెప్పించేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులు అత్యుత్తమంగా రాణించి మెడల్స్ తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో మైదానాలను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తోందని చెప్పారు. ఇక జిల్లాకు రూ.57 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందని, వచ్చే ఏడాదికి వనపర్తిలో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువత లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించేవరకు కష్టపడాలని, గత ఏడాది తెలంగాణ నుంచి పారా ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిన దీప్తి జీవాంజిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

జడ్చర్ల: ఇంట వద్ద ఖాళీగా ఉండకుండా పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేయమని భార్య చెప్పిన మాటలకు కోపంతో క్షణికావేశానికి గురై పురుగుల మందు తాగిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని కొండేడుకు చెందిన పడకంటి యాదగిరి(47) శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా.. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ప్రతిరోజు మద్యం తాగి ఎలాంటి పనులు చేయకపోవడంతో పొలం దగ్గరకు వెళ్లి పనులు చేయాలని చెప్పడంతో తన భర్త పురుగుల మందు తాగి మృతిచెందాడని భార్య భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలప లారీ పట్టివేత: కేసు నమోదు



పెద్దకొత్తపల్లి: అనుమతి లేకుండా అక్రమంగా కలప దుంగలను తరలిస్తున్న లారీని కొల్లాపూర్ ఫారెస్టు అధికారులు శనివారం రాత్రి దాడి చేసి కల్వకోలులో ఎస్ఆర్ఓ ఈశ్వర్, ఫారెస్టు సెక్షన్ అఫీసర్ శివకుమార్, బయన్న, లక్ష్మయ్య పట్టుకున్నారు. కల్వకోలులో వేప వృక్షాలను నెలకొరగా వేప దుంగలను కట్ చేసి లారీలో అక్రమంగా హైదరాబాదుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీని కొల్లాపూర్ టింబర్ డిపోకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పారెస్టు అధికారులు తెలిపారు. కలప స్మగ్లర్లు ఇబ్రహీంపట్నానికి చెందిన వ్యక్తులని పారెస్టు అధికారులు తెలిపారు.

0.97 గ్రాముల అల్ప్రాజోలం పట్టివేత

- కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు విమర్శలు



బిజినేపల్లి: మండలంలోని అల్లీపూర్ శివారులో బైక్‌పై అల్ప్రాజోలాన్ని తరలిస్తున్న ఇద్దరిని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అబ్కారీ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేశ్వరి తెలిపిన వివరాలు.. అబ్కారీ శాఖ ఉప కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేశ్వరి శనివారం మధ్యాహ్నం అల్లీపూర్ శివారులో అల్ప్రాజోలం తరలిస్తున్నారన్నా సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. నిందితులు సాంబమహేష్, వెంకటయ్యగౌడ్ అదుపులోకి తీసుకొని 0.97 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలో విచ్చల విడిగా అల్ప్రాజోలం సరఫరా అవుతుంటే అధికారుల దాడిలో పట్టుకున్న అల్ప్రాజోలం పరిమాణం విమర్శలకు తావిస్తోంది. మాముళ్ల మత్తులో స్థానిక అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.


37 గ్రాముల గంజాయి స్వాధీనం

కల్వకుర్తి రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 37 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని మార్చాల గ్రామంలోని మైసమ్మ దేవాలయం వద్ద ఒడిషాకు చెందిన అశ్విన్‌కుమార్‌సాహు అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అనంతరం జడ్జి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ శివారు కృష్ణానది సమీపంలోని పుష్కరఘాట్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిలో తేలింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రామన్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు దాదాపు 70 ఏళ్ల ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీచుపల్లి క్షేత్రంలో సినీ మ్యూజిక్ డైరెక్టర్



మ్యూజిక్ డైరెక్టర్ శివమణి

ఎర్రవల్లి: మహాలయ అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆదివారం సినీ మ్యూజిక్ డైరెక్టర్ శివమణి సందర్శించి.. తమ మాతృ, పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణానది పుష్కర ఘాట్ వద్ద పూజారి అనిల్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మిక సంబురం

నేటి నుంచి జోగుళాంబదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



విద్యుద్దీపాలతో జోగుళాంబ ఆలయ రాజగోపురం

- విద్యుద్దీపాల వెలుగుల్లో అలంపూర్ క్షేత్రం
- భారీగా తరలిరానున్న భక్తులు
- హాజరుకానున్న ప్రముఖులు

అలంపూర్: దక్షిణకాశీ అలంపూర్ క్షేత్రం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి ఉత్సవాలు ఆరంభం కానుండటంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వేర్వేరు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛారణలతో ఆలయ పరిసరాలు మార్మోగనున్నాయి. వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ దీప్తి తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆ వెలుగుల్లో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ సముదాయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

చీరల బహూకరణ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారికి తొమ్మిరోజులపాటు అలంకరించడానికి గద్వాల సంస్థానాధీశులు శ్రీకృష్ణరాంభూపాల్ చీరలను బహూకరించారని ఆలయ ఈఓ దీప్తి తెలిపారు.



కార్యక్రమాల వివరాలు..

ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగనున్నాయని ఈఓ వివరించారు. తొలి రోజు ఉదయం 8 నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగనుండగా.. మొదట స్వామివారి ఆనతి స్వీకరణ, యాగశాల ప్రవేశం, మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, మహా కలశస్థాపన, అగ్నిముఖం.. సాయంత్రం 6.30కి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు.

- 29వ తేదీ మూలా నక్షతం శుభ సమయంలో ఉదయం 10 గంటలకు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కళ్యాణం.. సాయంత్రం 4.30కి సింహవాహనసేవ నిర్వహించనున్నారు.
- 30వ తేదీ దుర్గాష్టమి రోజు ఉదయం 10 గంటలకు రథోత్సవం
- అక్టోబర్ 1 మహర్ణవమి రాత్రి కాళరాత్రి పూజలు జరగనున్నాయి.
- అక్టోబర్ 2 విజయదశమి రోజు అమ్మవారి ఆలయంలో ఉదయం 8 నుంచి మహా పూర్ణాహుతి, అవభృత స్నపనం.. సాయంత్రం 4 గంటలకు శమీ పూజ, 6.30కి నదీ హారతి, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, ధ్వజ అవరోహణం ఉంటుంది.

నిరంతర పూజలు..

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలతో పాటు నిరంతర పూజలు కొనసాగనున్నాయి. నిత్యం సహస్రనామార్చన, నవావరణ అర్చనలు, చండీహోమాలు, ఇతర హోమాలు జరగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు యథాతథంగా సాయంత్రం దర్బారుసేవలో అమ్మవారికి నవదుర్గల అలంకరణతో కొలువు పూజలు కుమారి, సువాసిని పూజలు, మహా మంగళహారతి, మంత్ర పుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

తెప్పోత్సవం.. ప్రత్యేకం

నవరాత్రి ఉత్సవాల అనంతరం విజయదశమి రోజు తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై కొలువుదీర్చి తుంగభద్ర నదిలో విహరింపజేస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పించనున్నారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.



విద్యుద్దీపాల అలంకరణలో జోగుళాంబ అమ్మవారి ఆలయం

పర్వతాపురం మైసమ్మ ఆలయంలో



నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలశ స్థాపన, గణపతి పూజ, 23న ప్రత్యేక అలంకరణ ప్రారంభం, 24న విశేష పూజ, 25న ప్రత్యేక అలంకరణ, 26న ప్రత్యేక అభిషేకాలు, 27న పుష్పార్చన, 28న కవచ ధారణ, ప్రత్యేక అలంకరణ, 29న సరస్వతి పూజ, చండీ హోమం, పూర్ణహుతి, 30న ఆయుధ పూజ, అక్టోబర్ 1న దేవి పూజా, 2న శమీ పూజా, దసరా ఉత్సవం, మంగళహారతితో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.

శ్రీరామకొండ.. కిటకిట



శ్రీరామకొండపై క్యూ కట్టిన భక్తులు

నారాయణపేట: కోయిలకొండ మండలకేంద్రం సమీపంలోని శ్రీరామకొండ భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులు శ్రీరామపాదాన్ని దర్శించుకొని రామనామ తారకమంత్రాన్ని పఠించారు. ముందుగా ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, నైవేద్యం సమర్పణ, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



కొండపైకి కాలినడకన వస్తున్న భక్తులు



స్వామి వారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి.. సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. కొందరు భక్తులు మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొడుతూ స్వామి చెంతకు చేరుకొని దర్శించుకున్నారు. మరికొందరు కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారుచేసి స్వామికి సమర్పించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో రద్దీగా కనిపించింది. జాతర మైదానంలోని దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. పలువురుభక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భారతమ్మ, నాగరాజు, భాస్కరాచారి ఏర్పాట్లను పరిశీలించారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

జూరాలకు 2.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల 29 గేట్ల ద్వారా దిగువకు పరుగులు పెడుతున్న వరద

- ప్రాజెక్టు 29 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.29 లక్షల క్యూసెక్కులు దిగువకు

ధరూరు/ఆత్మకూర్: కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద కొనసాగుతోంది. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 2.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 8 గంటలకు 2.20 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 29 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 2.01లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28,734 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 580 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2.29 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 33.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 12 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు 45,440 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి కొనసాగింది. ఇప్పటి వరకు ఎగువలో 6 యూనిట్ల ద్వారా 352.205 ఎంయూ, దిగువలో కేంద్రంలో 370.862 మిలియన్ యూనిట్లు కలిపి 723.067 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. జూరాలకు అత్యధికంగా వరదనీరు చేరుతుండడంతో దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఆదివారం విద్యుదుత్పత్తి చేపట్టలేదు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యు ఒడిలోకి..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్
- భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు



శ్రీనివాసులు మృతదేహం

గాయపడిన నిర్మల

చిన్నచింతకుంట: దైవ దర్శనానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన భార్యాభర్తలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో భర్త మృతిచెందగా.. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ ఓబుల్‌రెడ్డి వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన బుట్ట శ్రీనివాసులు (44), అతడి భార్య నిర్మల ఆదివారం కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కౌకుంట్ల మండలం తిర్మలాపురం గ్రామశివారులో చిన్నచింతకుంట మండలం గూడూరుకు చెందిన మహమ్మద్ రహీం ట్రాక్టర్ అతివేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య నిర్మలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ మార్చురీకి తరలించారు. మృతుడి తమ్ముడు గౌరీ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్, తులసీయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆస్పత్రికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి

నవాబుపేట: ప్రమాద వశాత్తు మహిళ కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని తీగలపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గూళ్ల పార్వతమ్మ(53) ఆదివారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటికి వచ్చి ప్రమాద వశాత్తు బాత్‌రూం గది ముందు కిందపడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..



బిక్య(ఫైల్)

తిమ్మాజిపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో జరిగినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని సూర్యనాయక్ తండాకు చెందిన ముడావత్ బిక్య(33) ఈ నెల 19న చౌట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఎంతకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న చెరువుకట్టపై మృతుడి చెప్పులు, బట్టలు కనిపించడంతో తండా వాసులు చెరువులో గాలించగా ఆదివారం బిక్య మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి మన్య ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హమాలీ దుర్మరణం



సువన్న (ఫైల్)

మక్తల్: ద్విచక్రవాహనం, కర్ణాటక బస్సు ఢీకొని హమాలీ మృతిచెందిన ఘటన మక్తల పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. మక్తల్ మండలం గడ్డంపల్లికి చెందిన సువన్న(45) మక్తల్‌లో హమాలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఆదివారం పనులు ముగించుకొని బైక్‌పై సొంతూరుకు వెళ్తున్న సమయంలో మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వెళ్తున్న కర్ణాటక బస్సు మక్తల్ పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం సమీపంలోని కల్వర్టు వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మక్తల్ మార్చురీ గదిలో ఉంచారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నవాబుపేట: తన కుమారుడు ఓ అమ్మాయిని ప్రేమించాడని, అమ్మాయి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి జైలుకు పంపించారని.. బయటికి వచ్చినా అదే మనసులో ఉంచుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఉత్తరప్రదేశ్‌కి చెందిన మోహన్ తండ్రి రామ్‌జిత్ తెలిపారు. పూర్తి వివరాలిలా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బాగేలీ జిల్లా పరిధిలోని సిద్దార్థనగర్‌కు చెందిన మోహన్(23) మండలంలోని కాకర్‌జాల్, చౌడూర్ గ్రామాల సమీపంలో ఉన్న ప్రైవేట్ కంపెనీలో పని చేసేవాడు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆదివారం మృతుడి తండ్రి రామ్‌జిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు మోహన్ సొంత రాష్ట్రంలో ఓ అమ్మాయిని వన్‌సైడ్ లవ్ చేశాడని, ఈక్రమంలో అమ్మాయి బంధువులు తన కుమారుడిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. కాగా జైలు నుంచి వచ్చిన అనంతరం సైతం అదే ధ్యాసలో బాధపడుతుండేవాడన్నారు. దూరంగా ఉంచితే మార్పు వస్తుందన్న ఆలోచనతో తెలంగాణలో తమ బంధుల ద్వారా ఇక్కడికి రెండు నెలల క్రితం పనికి పంపించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న తరుణంలో సైతం అదే బాధలో ఉండి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

- మరో మహిళకు తీవ్రగాయాలు



మమత (ఫైల్)

మక్తల్: పిడుగుపాటుకు మహిళ మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మమత (30), సుజాత, స్వప్న ముగ్గురు కలిసి వరిపొలంలో కలుపు తీసేందుకు ఉదయం 10 గంటల సమయంలో వెళ్లారు. మధ్యాహ్నా సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవగా.. పక్కనే ఉన్న వేపచెట్టు వద్దకు వెళ్లి నిల్చున్నారు. ఈక్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో మమత అక్కడికక్కడే మృతిచెందగా.. సుజాతకు తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు స్వప్న ప్రమాదం నుంచి బయటపడింది. అక్కడే ఉన్న మరో రెండు మేకలు మృతిచెందాయి. ప్రమాద విషయం తెలియడంతో మమత భర్త లక్ష్మయ్య, సుజాత భర్త అంజప్ప అక్కడికి చేరుకొని వారిని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మమత మృతిచెందిందని వైద్యులు తెలిపారు. సుజాత పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108 వాహనంలో మహబూబ్‌నగర్‌కు తరలించారు. మమత, సుజాత ఇద్దరూ తోడి కోడళ్లు. పిడుగుపాటులో ఒకే కుటుంబానికి చెందిన మహిళ మృతిచెందడం, మరొకరు తీవ్రంగా గాయపడడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత

నర్వ: మండలంలోని లంకాల్ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని డీ- 14 కెనాల్ వద్ద ఉన్న మట్టిని అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంపై మండిపడ్డారు. నర్వ వద్ద ఏర్పాటు చేస్తున్న ఓ పరిశ్రమ నిర్మాణ పనులకు మట్టిని అక్రమంగా తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం నర్వ పోలీస్ స్టేషన్‌లో మట్టిని తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందించారు.